విమోచనం

నా పెళ్ళి విషయమై ఇతర్లు ప్రసంగించకుండా ఉంటే అది నిజంగా ఇంత క్లిష్ట సమస్య కాకపోను. ఎందుకంటే నేనా విషయం తలపెట్టరాదని ఎన్నోసార్లు తీర్మానించుకున్నాను. ఏ పదహారో ఏటనో నాకు పెళ్ళి అయివుంటే ఎంతో బాగుండేది. కాని అట్లా జరగలేదు. అటు తర్వాత కూడా కొంతకాలం పాటు నేను పెళ్ళి విషయం తీవ్రంగా ఆలోచిస్తూ కూడా చేసుకోలేని స్థితిలో ఉండిపోయినాను. ఆ రోజుల్లో నన్ను పిల్చి నాకు పిల్లనిస్తామన్న మానవుడు లేకపోయినాడు. ఉన్న కాస్త ఆస్తీపోయి యాభై రూపాయలమీద పెద్ద సంసారం ఈదుతున్న వాడికి పిల్లనివ్వటానికెవరెగబడతారు మరి?

ఇంతలో నాకు సరోజిని పరిచయం కలిగింది. సరోజినిని చూసిన తరవాత నాకింకొకర్ని పెళ్ళాడాలనే ఆలోచన అసాధ్యం అయింది. ఆమెకి అంత అగ్రస్థానం ఎందుకిచ్చానో నేను చెప్పలేను. అంతన్న అందమైన వాళ్ళను చూసి ఉంటాను. అంతకన్న తెలివైన వాళ్ళని చూసి ఉంటాను. కాని నాకు మరే ఆడదీ అంత సమీపంలోకి మటుకు రాలేదు. నేను సరోజిని కోసం తపించలేదు, విరహం పడలేదు, కలలు కనలేదు. సామాన్య ప్రేమికులు చేసేది ఏదీ చెయ్యలేదు. కాని అంతకంటె లక్షరెట్లు సన్నిహితమైన పనిచేశాను – ఆమెతో నా యిష్టాయిష్టాలూ కష్టసుఖాలూ చెప్పుకున్నాను. సరోజిని నా ఆత్మతో పరిచయం చేసుకున్నది. అంతకంటె ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు సమీపించటం ఎట్లాగో నాకు తెలీదు.

నే నే వస్తువులు ఇష్టపడి తింటానో, ఏ పుస్తకాలు ఇష్టపడి చదువుతానో, ఏ రకం మనుషులతో మనస్ఫూర్తిగా మాట్లాడతానో, ఏ రకం హాస్యం ఆమోదిస్తానో సరోజినికి సమగ్రంగా తెలుసు. ఒక్క ముక్కలో చెప్పాలంటే నన్ను గురించి ఆమెకు తెలియని విషయం లేదు.

అదీగాక నా లక్షణాలను గురించి సరోజిని ఎన్నడూ ఎటువంటి తగాదా కూడా చెయ్యలేదు. "అందుకే నిన్ను చూస్తే నాకు కోపం" అనే పద్ధతి ఆమె నా విషయంలో ఒకసారి కూడా అవలంబించినట్టు నాకు జ్ఞాపకం లేదు. నన్ను ప్రత్యక్షాన ఎట్లా చూసేదో

పరోక్షాన నన్ను గురించి అంతకంటె తక్కువచేసి మాట్లాడేదనుకోను.... అనేక మందికి అపోహ కూడా కలిగింది. ఆమెకు నామీద ఏదో మమకారం ఉన్నదని!

మూడో విషయం ఏమంటే, నా పరిచయం వల్ల ఆమెలో ఏదో కొద్దిపాటి మార్పు కలిగిందని నా నమ్మకం. ఆ మార్పు ఆమెకుగాని ఆమె నెరిగిన వారికిగాని అసంతృప్తి కలిగించలేదని కూడా నా విశ్వాసం. “వెనకటికన్న సరోజిని ఇప్పుడు చాలా నయం కాదూ?.. సరదాగా మాట్లాడటం నేర్చింది!” అని ఒకరిద్దరు నా ఎదుటే అనటం జరిగింది. ఆ మార్పుకు నేనే కారణమైతే ఎంత బాగుండునని చాలా సార్లనుకున్నాను. ఆఖరుకు అతిశయం పట్టలేక నేనే కారణమని తెల్సుకున్నాను కూడాను. ఆ విశ్వాసం నన్నిప్పటికీ వదలకుండా వుంది. నిజం దేవుడికి తెలియాలి.

ఏమయినా మా యిద్దరి స్నేహం గురించి ఇప్పుడు వివరాలు తవ్వటం అనవసరం. అందులో తప్పు పట్టేటందుకేమీలేదు. దురదృష్టశాత్తూ అందులో ప్రణయలక్షణాలు – నేను పైన చెప్పినవి తప్ప – ఏమీలేదు. “నేను సరోజినిని ప్రేమిస్తున్నాను” అని కూడా నా అంతరాత్మలో అనుకున్న పాపాన పోలేదు.

కాని అకస్మాత్తుగా ఈ భావం పైకి రావటానికి ప్రబలమైన కారణం ఏర్పడింది. సరోజినికి వరసగా రెండు మూడు సంబంధాలు వచ్చినై.

సరోజిని నన్ను పెళ్ళి చేసుకోవాలని నేనెప్పుడూ అనుకోలేదు. ఆమెకి పై సంబంధాలు నా ఎదటే రావటానికి బదులు – ముందుగా ఎవరైనా మాకిద్దరికీ పెళ్ళయితే బాగుండునని సూచించి వున్నట్టయితే – నా ఆలోచనని ప్రతిఘటించి ఉండేవాణ్నేమో కూడానూ! ఎందుకంటే, నావంటి దరిద్రుణ్ని పెళ్ళాడి సరోజిని ఏం బావుకుంటుంది? నాకా మనిషి మీద ఈషమెత్తయినా ఇష్టం వుంటే నన్ను పెళ్ళాడమని ఎట్లా అనగలను?

కాని అట్లా జరక్క నా ఎదటే ఎవరో సరోజినిని చూడరావటమూ, సరోజిని తన తల్లిదండ్రులతో ఆ వచ్చిన వాడి మంచిచెడ్డలు తర్కించడమూ జరిగేసరికి నాలో ఏదో వింత వికారం కలిగింది. సరోజినికి నేనేమవుతాను? తన దారిన తాను ఎవరినో పెళ్ళాడి నా పరిచయాన్ని ఏం చేదామనుకుంటున్నది? ఇంకో ప్రాణి ఆత్మను అంత సులభంగా అవతల పెట్టెయ్యటానికున్నదా? ఉంటే నేను సరోజినిని అవతల పెట్టి మరెవరినో పెళ్ళాడటానికి నిశ్చింతగా ప్రయత్నం చెయ్యలేనా?... ఏ పిల్లనో చూడబోయి ఆమె అందచందాలను గురించీ, చదువు సంధ్యలను గురించీ నిశ్చితంగా చర్చించటం అసాధ్యమని నాకెందుకనిపించాలి?.... ఇంతకీ సరోజినికి ఆత్మ – “సోల్” అనే పదార్థం – లేదా? అంత సామాన్యపు మనిషా? అంత సామాన్యపు మనిషిని నేనింత పెద్ద చేశానా?

“ఏం చదివితే మాత్రం, నెలకి డెబ్భై సంపాదన; నాన్నా?” అని సరోజిని అన్న

మాటలు నా అంతరాత్మలో గులక రాళ్ళల్లే చేరి మథించినా జీర్ణానికి రాకపోయినై!.... యాభై సంపాదించుకునే నన్ను గురించి సరోజిని ఏమనుకుంటూ వుండి ఉండాలి?.... నేను ఒకంతట పశ్చాత్తాప పడే ప్రాణిని కాను. కాని సరోజినికి నా సంపూర్ణ పరిచయం – స్నేహం – ఇచ్చినందుకు నేను చెప్పతరం గాని బాధపడ్డాను. ఆమె విషయమై వెనక ఎన్నడూ రాని ఆలోచనలన్నీ వచ్చినై. సరోజిని నన్ను పెళ్ళాడటానికెందుకు ప్రయత్నం చెయ్యదూ? నేను తక్కువ సంపాదిస్తూ ఉంటేనేం? నాతో అసంతృప్తి చెందినట్టు కనిపించని మనిషి, డబ్బు కొంతవరకు త్యాగం చెయ్యకూడదా? ఎంత భాగ్యవంతుడు వచ్చినా తనకి లక్షాధికారి రాడుగదా! ఏ వందో సంపాదించేవాడు రావచ్చు. నా కోసం యాభై త్యాగం చెయ్యకూడదూ? తనని పెళ్ళాడే వాడు ఏ రెండు వందలో సంపాదిస్తున్నాడని తెలిస్తే వాడి అంతరాత్మ ఎటువంటిదైనా పెళ్ళాడేస్తుందా? ... ఈ ఆలోచనల కంతే లేదు.

నాకు మరో సంగతి కూడా తెలిసింది – నేను సరోజినిని ఇంతకాలమూ ఎంతో గాఢంగా ప్రేమించి ఉండాలి. ఆమె మీద ఇంత కోపంగా వున్నా కూడా ఇంత విశాల ప్రపంచంలోనూ నాకు సరోజిని కంటె దగ్గిరిగా రాగల మరో ఆడది కనిపించలేదు. సరోజిని మరొకణ్ని పెళ్ళాడటం ఎంత రూఢో నేను ఆజన్మ బ్రహ్మచర్యం అవలంబించటం కూడా అంత రూఢే అని తేలిపోయింది.

❀ ❀ ❀ ❀ ❀

చిత్రమేమిటంటే నేను మావూరు, సరోజినిని వదిలేసి వెళ్ళిన సంవత్సరానికి కూడా ఈ విశ్వాసం నాలో అట్లాగే ఉండిపోయింది. కాని సరోజినికింకా పెళ్ళి కుదరనేలేదు. ఆ విషయం నాకు పట్టలేదు. సరోజిని ఎవర్నయినా చేసుకోనీ, చేసుకోకపోనీ నన్ను మటుకు చేసుకోదు. ఆమెతో స్నేహం చేసినందుకెప్పుడయితే పశ్చాత్తాప పడ్డానో అప్పుడే మా ఇద్దరి మధ్యా ఉన్న బాంధవ్యం కాస్తా దగ్ధమైపోయింది. నేను చాలా అతిశయం గల జీవిని, నాలో ఒక మనిషి రెండుసార్లు పశ్చాత్తాపం తెప్పించినా? వొట్టిది!

నాకిప్పుడు ఒకటే ఆలోచన – సంపాదన. డబ్బే నాకు చుక్కాని. లంగరు లేనేలేదు. నెలకు రెండు మూడు వందలు సంపాదించే వాళ్ళు చాలా గొప్ప వాళ్ళయితే నేను సంపాదన కోసం ఎక్కడికైనా వెళతాను. అవసరమైతే సముద్రాలు దాటిపోతాను. నన్నొక్కచోట బంధించేటందుకేమున్నది?

సముద్రం ఒడ్డుకిపోతే గాగిచిప్పలు కావలసినన్ని. డబ్బు సంపాదించటం కష్టం కాదు – అదే ఆశయంగా పెట్టుకొని మిగతా విషయాలు ప్రాముఖ్యం ఇవ్వకుండా వుంటే! పట్నం చేరాను. మనుషుల్ని ఆశ్రయించాను. ఏర్లుదాటి తెప్పలు కాల్చాను. మనుషులకి

వేరే విలువలు చూడలేదు. ఏరుదాటే తెప్ప అవునా కాదా అని తప్ప. ఓ సంవత్సరం తిరిగేటప్పటికి ఓ వెయ్యి బాంకులో నిలవ చేశాను. నెలనెలా రెండు వందల యాభై అందుతున్నై.

ఆనందమా? తృప్తా? అటువంటిదేమీలేదు. యదార్థం చెప్పాలంటే ఈ మహా పట్టణంలో నేను పొందిన ఆనందమంతా కలిపితే సరోజినితో ఒక్క గంట గడిపిన తృప్తితో సమానవుతుందని నాకు నమ్మకం లేదు. కాని సరోజిని స్నేహానికి జరిగిన పరాభవం చూస్తూ ఆ తృప్తిని గురించి ఏమని తృప్తిపడను? అనుభవాన్ని ఎట్లా తృణీకరించను? ఆ తృప్తిని గురించి తలచుకోవటానికి ప్రయత్నించినప్పుడల్లా నాకు జ్ఞాపకం వస్తున్నది పరాభవమే. అది నన్ను వెన్నంటి వదలకుండా ఉంది.

కొంత ఆత్మోపశాంతి చేసుకుందామనే ఉద్దేశంతో సరోజిని తండ్రికి ఒక ఉత్తరం రాశాను: నా సంపాదన గురించి రాస్తూ, డబ్బును తిట్టాను. దానివల్ల మనశ్శాంతి లేదన్నాను. సరోజినికి తెచ్చే మొగుణ్ని కేవలం డబ్బు మాత్రమే చూసి నావంటి ఆత్మశాంతి లేనివాణ్ని తీసుకురావద్దన్నాను.

ఈ ఉత్తరానికి సరోజిని స్వయంగా సమాధానం రాస్తూ నేను బాగా సంపాదించుకుంటున్నందుకు తనకు చాలా సంతోషంగా ఉన్నదనీ, నాకు అర్థమైన సంపాదన లేనందుకు వెనక తనకు ఎంతో కష్టంగా ఉంటూ ఉండేదనీ, దారిద్ర్యం ఎరిగి ఉండి కూడా నేను డబ్బును తృణీకరించటం తనకు నచ్చలేదనీ, తను పెళ్ళాడితే తప్పకుండా నావంటి వాడినే పెళ్ళాడుతుందనీ, ఆత్మశాంతి నాకు లోపించిన పక్షంలో నాకు తగిన ఆడదాన్ని పెళ్ళాడి తద్వారా తెచ్చుకోవచ్చుననీ, డబ్బును తిట్టనవసరం లేదనీ బోధించింది.

ఆ ఉత్తరం చూసి నేనేమనుకోను? ఎండిపోయిన చెట్టు చిగిర్చినట్టయింది. మళ్ళీ నేనెరిగిన గొంతు వినిపించింది. సరోజినిని నేనపార్థం చేసుకున్నానేమోనని అనుమానం కలిగింది. ఆలోచించినకొద్దీ అనుమానం హెచ్చిందేగాని తగ్గలేదు. సరోజిని నాకు చేసిన అపకారమేమిటి? ఆమె పైకేమంటేనేం? ఎవర్ని పెళ్ళాడింది? ఎవర్నీ పెళ్ళాడలేదు.. నేను తనని పెళ్ళాడటానికి సిద్ధంగా ఉన్నానని తెలిస్తే – నేను నోరుచేసుకుని అడిగివుంటే – నన్ను పెళ్ళాడేదేమో? నేనెందుకంత తొందరపడ్డాను? వెనక నాకైనేను ఆమెను పెళ్ళాడతాననక పోవటానికి కారణం ఉంది – దారిద్ర్యం. ఇప్పుడది అంతగా లేదుగా? ఇప్పుడు మించిపోయిందేమిటి? ఇప్పుడెందుకడగరాదూ.

కూచుని సరోజినికి ఎంతో ప్రేమపూర్వకంగా ఉత్తరం రాశాను. కవరుమీద ఎడ్రసు కూడా రాశాను. ఉత్తరం తిరిగి చదువుతుండగా భయంకరమైన అనుమానం మరొకటి తలఎత్తింది.

నేను దారిద్ర్యంలో వున్న రోజుల్లో సరోజిని నావంటి వాణ్నే తప్పక పెళ్ళాడతానని సూచనగానైనా నాతో ఎందుకనలేదూ? అప్పటికీ యిప్పటికీ నాలో ఏదో తేడా వుండబట్టేనా? అది నా యిప్పటి అప్పటి ఆర్జనల తేడాయేనా?

నా ఉత్సాహమంతా భగ్నమయింది. నేను రాసిన ఉత్తరం చించేశాను. నా అశాంతి పదింతలయింది. నేను వెనక హృదయంలో పెట్టుకుని తిరిగిన సరోజిని ఏమయింది! ఆ సరోజినికి బదులు ఈ సరోజిని ఎక్కణ్ణించి ఊడిపడింది? ఈ సరోజినిని ఆకర్షించిన నా జీతం మీదా నేను చేసే అర్థంలేని ఉద్యోగం మీదా రోత పుట్టింది.... నేనింత దూరంవచ్చి డబ్బు సంపాదించటానికింత శ్రమపడింది ఈ సరోజినిని ఆకర్షించటానికేనని నాకిప్పుడు తోచసాగింది. నా ప్రయత్నం సఫలమయింది. సరోజిని నన్నిప్పుడు నమ్మకంగా పెళ్ళాడుతుంది! కాని నాకు సంతృప్తి కలగలేదు. పైపెచ్చు ఈ సరోజిని ఎదట కనిపిస్తున్నకొద్దీ నేను వెనక ఎరిగిన సరోజిని కోసం ప్రాణం పీకసాగింది. ఆమెకోసం ఎక్కడ వెతకను?

❀ ❀ ❀ ❀ ❀

ఈ విధంగా నేను బాధపడుతున్న సమయంలో నాకు పెళ్ళిచేయాలని చాలామంది పట్టుపట్టినట్టు విశదమయింది. అంతా కూడబలుక్కున్నట్టు అనేకమంది బంధువులూ స్నేహితులూ నాకు సంబంధాలు తీసుకురాసాగారు... ఒక్కసారిగా ఒక డజను మంది సరోజినులు – నాకక్కర్లేని సరోజినులు – వెంటపడ్డట్టయింది.

“ఎవర్నో ఒకర్ని పెళ్ళిచేసుకుని నలుగురితోబాటే కాలం వెళ్ళబుచ్చవచ్చు. నీ ముష్టి రెండు వందలయాభై రూపాయల గురించి ఇంత మధనపడకు,” అని అంతరాత్మ మందలించసాగింది.

“నీ సరోజిని ఎక్కడో వుంది. వెతికిపట్టుకో. నలుగురితో పాటే అని అందరూ దిగే బురద గుంటలో దిగకు. నీ వ్యక్తిత్వం చేజేతులా పారేసుకోకు,” అని మరోవంక బుద్ధిమందలిస్తూ వచ్చింది.

ఈ సందిగ్ధంలో సత్యనారాయణగారు ఒక మంచి సంబంధం తెచ్చారు. ఎవరో బీదవాళ్ళ పిల్లట. చాలా బుద్ధిమంతురాలట. పనీపాటలు బాగా వచ్చుట. “నువ్వు చేసుకుంటే బాగా సుఖపడతావు. ఆ పిల్ల తల్లిదండ్రులకీ మహోపకారం చేసినవాడివవుతావు.... నీకు ఉద్యోగం లేకపోయినా నీ వంటి సంబంధం వాళ్ళు తీసుకురాలేదు. అంత బీదవాళ్ళు, పాపం. నిన్ను కళ్ళకద్దుకుంటారు.....” అన్నారాయన.

మిగిలిన బంధుమిత్రులందరి సిఫార్సులూ పెడచెవిన బెట్టిన నేను సత్యనారాయణ

గారి మాటలు ఆలకించాను. ఆయన భాష నాకెప్పుడూ అర్థమవుతుంది. ఆయన చాలా ఉత్తముడు ..... ఆయనతో పరిచయం లేకపోతే ఈ పట్టణం నాకు దాదాపు అరణ్యమే.

కాని ఆ బీదపిల్లని చేసుకుంటానని సత్యనారాయణగారి కెట్లా మాట ఇవ్వను? ఆ పిల్లని చేసుకోవటానికి ఒకటే అభ్యంతరం – నేను పోగొట్టుకున్న సరోజిని! ఆ సరోజినిని పట్టుకోవటానికి నేను ఏ మాత్రమైనా ప్రయత్నించవద్దా? ఎట్లా ప్రయత్నించను?

ఆలోచించగా, ఆలోచించగా ఒక మార్గం దొరికింది.

❀ ❀ ❀ ❀ ❀

నన్ను చూసి సరోజిని చాలా సంతోషం కనబరిచింది. ఏదో ఉద్రేకం దాచటానికల్లే వసపోసిన పిట్టలాగ ఊపిరి తియ్యకుండా మాట్లాడింది. ఆఖరుకు మాటల సందర్భంలో ఏ పని మీద వచ్చాననేదీ ఎంత కాలం వుంటాననేదీ ఆమె నోటంట దొర్లినై.

పెళ్ళి చేసుకునేటందుకుని వచ్చానన్నాను. ఎవరినన్నది.

"చేసుకుంటే నిన్నయినా చేసుకుంటా" నన్నాను.

"నేనే ఏమిటి? చేసుకోదలిస్తే నాకన్న మంచివాళ్ళే దొరుకుతారు," అన్నది సరోజిని.

"నాకు నువు చాలు," నన్నాను. "అయినా పట్నంలో ఉద్యోగం చేస్తుండగా ఎవరైనా దొరికే వాళ్ళేమోగాని ఇప్పుడెవరు దొరుకుతా," రన్నాను.

సరోజిని వులిక్కిపడింది. "ఏమిటి ఉద్యోగం పోయిందా?" అన్నది.

"నేనే వదిలేశాను," అన్నాను.

ఎందుకన్నది.

"చూడు, సరోజినీ. నేను నిన్నే పెళ్ళి చేసుకుందామని గట్టి తీర్మానంతో వచ్చాను. నువు నన్ను ఉద్యోగం కోసం చేసుకుంటున్నావనేది నన్ను బాధించకుండా వుండగలందులకు ఉద్యోగం వదిలేసి వచ్చాను," అన్నాను.

సరోజిని మొహం జేవురించింది.

"అయితే నాలో అంత నమ్మకం లేదా?" అన్నది.

"నాలోనే నమ్మకం లేదు. నావంటి వాన్ని నువు చేసుకుంటావని నమ్మకం లేకనే ఈ పని చేశాను," అన్నాను.

"వుద్యోగం మానెయ్యకుండా వస్తే ఆ ఉద్యోగంచూసి ఒప్పుకుంటాననేనా మీ భయం" అన్నది.

"ఆ భయం నువు ఈ క్షణాన తీర్చవచ్చు. నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నాను.

"క్షమించండి. నాలో నమ్మకం లేని వాళ్ళని ఎట్లా చేసుకోను?" అంటూ లేచిపోయింది. నేను ఆమెను నిలిపి, "అన్నీ వొట్టిదే. ఉద్యోగం పోలేదు. ఏమీపోలేదు. వేళాకోళానికన్నాను."

తక్షణమే ఆమె మొహం మారింది.

"మీదంతా విచిత్రమైన హాస్యం... పెళ్ళికెన్ని రోజులు శలవు తీసుకున్నారు" అన్నది.

"వారం రోజులు" అన్నాను.

"అంటే? అప్పుడే రెండు రోజులైపోయినాయిగదా? ప్రయత్నాలు చేసుకోవద్దా? ముహూర్తం పెట్టుకోవద్దా ఏదీ వ్యవధానం?" అన్నది.

"ప్రయత్నాలేమీ లేవు... వాళ్ళు, పాపం, చాలా బీదవాళ్ళు. ఏదో ముహూర్తం వుందని చెప్పారు. దానికి చేసెయ్యమంటే చేసేస్తారు" అన్నాను.

పాపం సరోజిని మొహం సున్నం కొట్టినట్టయింది.

"ఎ-ఎ-ఎవరు - వాళ్ళు?" అన్నది.

చెప్పాను, వీలుంటే పెళ్ళికి రమ్మని ఆహ్వానించాను.

సరోజిని నాకేసి చూళ్ళేకపోయింది. తలవంచుకుని పిలుస్తున్నా పలక్కుండా వెళ్ళిపోయింది.

నా మనస్సు కుదుట పడింది. ప్రశాంత హృదయంతో ఆ సాయంకాలమే నాకాబోయే అత్తవారూరు ప్రయాణమైనాను.

మొదటి ముద్రణ : రూపవాణి, జనవరి 1945